# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విజన్ ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యం అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

4. **కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.**

5. **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు జల వనరుల సంరక్షణకు గానూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి జల్ సించాయ్ జన్ భాగీదారీ అవార్డు లభించింది.**

==========================

విజన్ ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. లండన్‌లో గత రాత్రి జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు, సంస్థలు వాటి ప్రణాళికలను మార్చుకోవాలని సూచించారు. ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పారిశ్రామికవేత్తలు పాల్గొనాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరుతూ...

వాయిస్.. 34 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల కళాశాలను ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను కేంద్రమంత్రి

ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు అంశంలో మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వివరిస్తూ..

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 7 వేల 2 వందల 44 క్లస్టర్ల గ్రామ పంచాయతీల వ్యవస్థను రద్దు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. 13 వేల 351 పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించింది. రూర్బన్ పంచాయతీలో 359, గ్రేడ్-1లో 3 వేల 82, గ్రేడ్-2లో 3 వేల 163, గ్రేడ్-3లో 6వేల 7వందల 47 పంచాయతీలుగా ఆమోదించారు. ఇందులో గ్రామ పంచాయతీల పునర్ వ్యవస్థీకరణ, సిబ్బంది కూర్పు, కార్యదర్శుల పదవుల వర్గీకరణ, ప్రమోషన్లు వంటి పలు నిర్ణయాలు ఉన్నాయి.

---------------------------

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఉన్న మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో సాగర సుప్రభాత హారతి కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలుపుతూ..

వాయిస్..25 సెకన్లు

మరో వైపు ఏలూరు, ఎన్టీఆర్, తిరుపతి జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

---------------------------

కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మలి మండలం కిష్టుపురం గ్రామంలో నూతన సచివాలయం భవనాన్ని ఆయన నిన్న సాయంత్రం ప్రారంభించారు. గ్రామంలోని పాత వీధి నుంచి రామాలయం వరకు నిర్మించనున్న రహదారులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. జల

వనరుల సంరక్షణకు గానూ.. జల్ సించాయ్ జన్ భాగీదారీ అవార్డును కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గడిచిన ఏడాది కాలంలో జిల్లాలో జల వనరుల సంరక్షణ, నీటి వృథాను అరికట్టడం, జల వనరుల సంరక్షణ పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు జిల్లాను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అర్చనా వర్మ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నిన్న లేఖను పంపించారు. ఈ అవార్డు రావడం పట్ల అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

---------------------------

వృత్తి దారులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఆధునిక పరికరాలు అందజేసి, శాశ్వత ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో ఉన్న బిసి భవన్‌లో పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లతో ఆమె నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి కోట్ల రూపాయలతో ఆదరణ పథకాన్ని 3వ విడత అమలు చేయనున్నట్లు తెలిపారు. గత 16 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లపై ఉందన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న...ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం కింద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 21 గిరిజన గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన గ్రామాల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపామని.. త్వరలోనే నిధులు విడుదలవుతాయని వెల్లడించారు. ఈ నిధులతో ఆయా గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు వివరించారు.

---------------------------

సిక్కులు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగలలో ఒకటైన గురునానక్ జయంతిని ఈరోజు నిర్వహిస్తున్నారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం కార్తీక మాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. దీనిని "గురుపర్వ్" లేదా "ప్రకాష్ పర్వ్" అని కూడా అంటారు. సిక్కు మతాన్ని స్థాపించిన గురునానక్ దేవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పండుగను నిర్వహిస్తారు. గురునానక్ దేవ్ సిక్కు మతాన్ని స్థాపించడంతో పాటు సిక్కు మతస్తుల మొదటి గురువుగా ఉన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఈ రోజు అన్ని గురుద్వారాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేశారు.

=====================